ప్రగతి పథంలో రామవరప్పాడు సొసైటీ

- అభివృద్ధి దిశగా పయనిస్తున్న సంఘం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.11 కోట్ల రుణాలు అందజేత
- అత్యధికంగా రూ.16 కోట్ల టర్నోవర్
- నూతన భవన నిర్మాణానికి రూ.2 కోట్లతో శంకుస్థాపన



రామవరప్పాడులోని విశాల సహకార పరపతి సంఘం

రామవరప్పాడు: గత టీడీపీ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలకు కేంద్ర బిందువుగా మారిన రామవరప్పాడు విశాల సహకార పరపతి సంఘం నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. గత ప్రభుత్వంలో సకాలంలో రైతులకు రుణాలు, విత్తనాలు అందక ఎదుర్కొన్న ఇబ్బందులకు చెక్ పెట్టి అర్హత కలిగిన ప్రతి ఒక్క రైతుకు రుణాలు అందిస్తూ వారి ఆర్థిక పురోభివృద్ధికి కృషి చేస్తుంది. రైతుల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలను సక్రమంగా అమలు చేస్తూ ఉన్నతాధికారుల మన్ననలు అందుకుంటుంది. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు విశాల సహకార పరపతి సంఘం రైతులకు అనేక సేవలందిస్తూ ముందంజలో ఉంది. ఈ సొసైటీ పరిధిలో రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాలున్నాయి. ఎ క్లాస్ సభ్యులు 319, బీ క్లాస్ సభ్యులు 551 మంది ఉన్న ఈ సొసైటీ ప్రగతి పథంలో నడుస్తూ పలు సహకార సంఘాలకు ఆదర్శంగా నిలుస్తుంది. 2019కు ముందు రూ.6 కోట్లు ఉన్న టర్నోవర్ ప్రస్తుతం అత్యధికంగా రూ.16 కోట్లకు చేరుకోవడమే దీనికి నిదర్శనం. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల ప్రయోజనార్థం గత 3 సంవత్సరాల కాలంలో ఈ సొసైటీ అత్యధికంగా రూ.11 కోట్ల రుణాలు అందజేసింది. రామవరప్పాడు, ఎనికేపాడు, ప్రసాదంపాడు గ్రామాల్లోని రైతులకు సకాలంలో రుణాలు అందజేసి వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహిస్తుంది. 2019 నుంచి 2023 వరకు వ్యవసాయం, కర్షక మిత్ర, రైతు నేస్తం, ఎల్‌టీ, కౌలుదారి రుణాలు, సీసీ, ఎల్ఎఫ్‌డీ కలిపి మొత్తం సుమారు రూ.11 కోట్లను రుణాల రూపంలో అందజేసింది.

రుణాలు	సంవత్సరం	అందించిన మొత్తం
వ్యవసాయం	2019–23	రూ.82 లక్షలు
కర్షకమిత్ర, రైతు నేస్తం	2019–23	రూ.8.85 కోట్లు
ఎల్‌టీ	2019–23	రూ.1.64 కోట్లు
కౌలుదారి రుణాలు	2019–23	రూ.1.15 లక్షలు
సీసీ (కోవిడ్ సమయంలో ఇచ్చిన రుణాలు)		రూ.8లక్షలు
ఎల్ఎఫ్‌డీ	2019–23	రూ.12 లక్షలు

సొంత భవనానికి శంకుస్థాపన..

ఈ సొసైటీకి ప్రసాదంపాడులో 1957లో యాదవ వంశస్తుల్లో పలువురు దాతలు 21 సెంట్ల స్థలాన్ని విరాళంగా అందజేశారు. సొసైటీకు సొంత స్థలమున్న భవన నిర్మాణం ఇప్పటి వరకు జరగలేదు. టీడీపీ ప్రభుత్వంలో సొంత భవనానికి నిధులు మంజూరు చేయాలని ఎన్నిసార్లు వినతి పత్రాలు సమర్పించిన ప్రయోజనం కలుగలేదు. దీంతో సొసైటీ పరిధిలోని రైతులను కలుపుకుని గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు సొసైటీ సొంత భవన నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేయాలని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ కర్త తలశిల రఘురాం దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన వీరు నిధుల మంజూరుకు కృషి చేశారు. ఈ మేరకు నాబార్డు నుంచి రూ.2 కోట్ల నిధులతో నాలుగు అంతస్తుల భవన నిర్మాణం చేయనున్నారు. దీని నిమిత్తం ఇటీవల భవన నిర్మాణానికై కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ శంకుస్థాపన చేశారు. అతి త్వరలో దీని నిర్మాణ పనులు ప్రారంభించి 4 నెలల్లో పూర్తి చేయనున్నారు.


సొసైటీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మెల్యే వంశీ (ఫైల్)

మోడల్ సొసైటీగా తీర్చిదిద్దుతున్నాం



టీడీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ఈ సొసైటీను మోడల్ సొసైటీగా తీర్చి దిద్దుతున్నాం. గత ప్రభుత్వంలో మాదిరిగా అక్రమాలు, అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా రైతులకు సేవలందిస్తున్నాం. 2023 మార్చి నాటికి అత్యదికంగా రూ.16 కోట్ల టర్నోవర్‌కు చేరుకున్నాం. సకాలంలో రుణాలు అందిస్తూ రైతాంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. త్వరలో గ్రామంలో సొసైటీ నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించనున్నాం. రామవరప్పాడు ఫ్లైఓవర్ సమీపంలో 25 సెంట్లలో సొసైటీ గోడౌన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం.

– సాదం వెంకటేశ్వరరావు, రామవరప్పాడు సొసైటీ అధ్యక్షుడు

జగనన్న విద్యాకానుక పంపిణీ

ఉయ్యూరు: పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కొనసాగుతోంది. ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని జెడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు జగనన్న విద్యాకానుకను అందజేయటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కానుకను అందుకుని సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ఆకునూరు ఎంపీపీ పాఠశాలలో బుధవారం జగనన్న విద్యాకానుకను వైస్ ఎంపీపీ రాచాబత్తుల మధుసూదనరావు అందజేశారు. కలవపాములలో సర్పంచ్ పానుగుమాటి బాలస్వామి కానుక పంపిణీ చేశారు.


కానుక పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ రాచాబత్తుల మధుసూదనరావు

పోరంకిలో ఘనంగా చేగువేరా జయంతి

పెనమలూరు: విప్లవ వీరుడు చేగువేరా 95వ జయంతి తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకిలో బుధవారం ఘనంగా చేశారు. చేగువేరా చిత్రపటానికి డీవైఎఫ్ఐ పెనమలూరు మండల కార్యదర్శి పుసులూరి లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నేటి యువత చేగువేరా ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువత క్రమశిక్షణతో ఉండాలని, సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పాడ త్రిమూర్తి, వీసం సోమశేఖర్, టి.లావణ్య, కె.తరుణ్, వై.సరళ, ఎం.రోహిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పోరంకిలో చేగువేరా జయంతి నిర్వహిస్తున్న యువజన సంఘాలు

ప్రభుత్వ పథకాలను పరిశీలించిన ముంబయి బృందం

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పాఠశాలల అభివృద్ధి తదితర అంశాలు పరిశీలించటానికి ముంబయి నుంచి ప్రతినిధి బృందం బుధవారం మండలంలో పర్యటించారు. తొలుత బృంద సభ్యులు పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు కింద జరిగిన అభివృద్ధి పనులు తిలకించారు. పాఠశాల తరగతి గదుల్లో మౌలిక వసతులు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి, అటల్ టింకరింగ్ ల్యాబ్ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రతినిధి బృందం సభ్యుడు గౌరవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యా విధానం ప్రవేశ పెట్టడం వలన విద్యార్థులకు చాలా మేలు జరుగుతుందన్నారు. అనంతరం బృందం వణుకూరులో జగనన్న కాలనీలో గృహాలు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. సచివాలయం ద్వారా అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకున్నారు .రైతు భరోసా కేంద్రంతో రైతులకు అందుతున్న సేవలు పరిశీలించారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతా శర్మ, ఏవో లోయ శివశంకరరావు, హెచ్‌ఎం వై.దుర్గాభవాని పలువురు అధికారులు పాల్గొన్నారు.


పెనమలూరు జెడ్పీ హైస్కూలును పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతున్న ముంబయి బృందం

వేటకు వేళాయెె!

బుధవారం అర్ధరాత్రితో ముగియనున్న నిషేధాజ్ఞలు

కోడూరు(అవనిగడ్డ): చేపల వేట నిషేధాజ్ఞలు పూర్తి కావడంతో గంగపుత్రులు తిరిగి సముద్రంలో వేటకు వెళ్లేందుకు సమాయత్తమయ్యారు. సముద్రంలో చేపలు సంతానోత్పత్తి చెందే సమయమైన ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు కేంద్ర ప్రభుత్వం సముద్రంలో వేట నిషేధాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం అర్ధరాత్రితో 61 రోజుల వేట నిషేధ సమయం ముగియడంతో గురువారం నుంచి మత్స్యకారులు యథావిధిగా వేటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

దివిసీమలో సిద్ధమైన 1,304 బోట్లు..

దివిసీమలోని నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ మండలాల్లో సుమారు 30 వేల మత్స్యకారులు ఉన్నాయి. అయితే వీరిలో 15 వేల మంది ప్రత్యక్షంగా చేపల వేట ఆధారంగానే జీవనం సాగిస్తున్నారు. మూడు మండలాల్లో 1,304 లైసెన్స్ కలిగిన వేట బోట్లు ఉండగా, వీటితో పాటు మరో 500కు పైగా సంప్రదాయ పడవలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం నిషేధ కాలంలో మత్స్యకారులు బోట్లను ఒడ్డుకు చేర్చి ఇళ్లకే పరిమితమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసా కింద ప్రతి కుటుంబానికి రూ.10 వేలు అందించి వీరికి తోడ్పాటునిచ్చారు.

సిద్ధమైన పడవలు, వలలు..

గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మంగళ, బుధవారాల్లో దశమి గడియలు ఉండటంతో మత్స్యకారులు తమ పడవలకు పూజలు చేశారు. వలలు, డీజిల్, తాగునీటి వంటివి సమకూర్చుకున్నారు. మత్స్యశాఖ అధికారులు బోట్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేసి, మత్స్యకారులు వేట సమయంలో అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

చురుగ్గా అంతర్గత రహదారుల నిర్మాణం

- బ్యాంకు కాలనీలో పూర్తయిన తారు రోడ్డు పనులు
- తుదిదశలో పలు రహదారుల పనులు

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడులో అంతర్గత రహదారుల అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పట్టణంలోని బ్యాంకు కాలనీ, పలు వార్డుల్లో తారు రోడ్డు, సీసీ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి.

రూ.23 లక్షలతో రహదారుల పనులు

అంతర్గత రహదారుల నిర్మాణంపై పంచాయతీ పాలకవర్గం దృష్టి సారించింది. బ్యాంకు కాలనీ మొదటి రోడ్డు ప్రధాన రహదారి మార్గం అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి రూ.16 లక్షలు అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. రోడ్డు మార్జిన్‌లను సరిచేసి, వాహనాల రాకపోకలకు వీలుగా మార్గాన్ని నిర్మించారు. దీంతోపాటుగా పట్టణంలోని 16వ వార్డు, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల రోడ్డులోని అంతర్గత రహదారి అభివృద్ధి పనులు చేపట్టారు. అంతర్గత రహదారులను సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.7 లక్షలు అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం గ్రావెల్ పనులు పూర్తయ్యాయి. కాంక్రీటు పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


కంకిపాడు బ్యాంకు కాలనీలో పూర్తయిన తారు రోడ్డు

ప్రాధాన్యతా క్రమంలో పనులు

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. అన్ని వార్డుల్లోనూ సమ ప్రాధాన్యంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పాలకవర్గం కృషి చేస్తోంది. మౌలిక వసతులను కల్పించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సమన్వయంతో పనిచేస్తున్నాం.

– బాకీ రమణ, సర్పంచ్, కంకిపాడు

కానూరులో అంగన్‌వాడీ చిన్నారుల ర్యాలీ

పెనమలూరు: కానూరులో అంగన్‌వాడీ చిన్నారులు, కార్యకర్తలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ చిన్నారులకు ఆరేళ్ల లోపు ఉండే బాల్యదశ చాలా ముఖ్యమైందన్నారు. చిన్నారుల పురోగతికి సమాజంలో అందరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు సమాజంలో ఉన్న వారికి పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల ఆవశ్యకతను అవగాహన కల్పించటానికి జగభాగీదారీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ ఫాతిమా, మెహరున్నీసా పలువురు పాల్గొన్నారు.


కానూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ చిన్నారులు

నీట్‌లో సెయింట్‌జాన్స్ విద్యార్థినికి 427వ ర్యాంక్

గన్నవరం: స్థానిక వివస్. సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నీట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించినట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ...నీట్ పరీక్షలో తమ పాఠశాల విద్యార్థిని హీరారేష్మి జాతీయ స్థాయిలో 427 (కేటగిరి) ర్యాంక్‌ను సాధించినట్లు చెప్పారు. హీరా రేష్మి 98.96 పర్సన్‌టైల్ సాధించగా, అశోక చక్రవర్తి 96.43, హృదయాక్షిత 93.68 పర్సన్ టైల్‌తో తర్వాత స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు సీనియర్ బ్రదర్స్ బ్రదర్ సీజె. థామస్, బ్రదర్ జిమ్మీకురి యోకోస్, బ్రదర్ బి.జోసఫ్, బ్రదర్ జయబాలన్, పలువురు ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో వాగులో ఉంటున్న ప్రజల సౌకర్యార్థం 10 వేల లీటర్ల సామర్థ్యం గల మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి బుధవారం సర్పంచ్ కాటూరి సరళ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వై. నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, పార్టీ నాయకులు జూనపూడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చిత్రలేఖన శిక్షణ తరగతులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చిన్నారుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయాలనే ఉద్దేశంతో స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి చిత్రలేఖన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్, పెన్సిల్ షేడింగ్, పెన్ డ్రాయింగ్, కార్టూన్స్, పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్, కాలిగ్రఫీ, పేపర్ క్విల్లింగ్, క్లే మౌల్డింగ్, మండాల ఆర్ట్, మైక్రో ఆర్ట్, లీఫ్ ఆర్ట్, ఫొటోగ్రఫీ, ఫొటోషాప్, డిజిటల్ పెయింటింగ్ లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం జూలై 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే టెక్నికల్ గ్రేడ్ లోయర్, హయ్యర్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు గాయత్రి నగర్, కంచుకోట వారి వీధిలో గల స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ నందు గానీ లేదా 98493 55339, 93908 47433 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణంలో పొరపాట్లకు తావివ్వకండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): అద్భుతంగా నిర్మాణం జరుగుతున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణంలో ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా పనులు జరగాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్వరాజ్యమైదానంలో జరుగుతున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఎలివేషన్‌లో శాండ్ స్టోన్‌తో తయారు చేసిన అల్యూమినియం ఛానల్స్‌ను పరిశీలించారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు నిర్వహించాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. కారిడార్ మొత్తంలో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విగ్రహ నిర్మాణంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలుసుకుని పలు సూచనలు చేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కారిడార్ మొత్తం గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్‌స్కేప్, కాంపౌండ్‌వాల్ నిర్మాణాలను పరిశీలించిన కమిషనర్ అన్ని భాగాలను కలిపి జాగ్రత్తగా విగ్రహ నిర్మాణం చేయాలని సూచించారు.

క్లుప్తంగా

నేడు పేరంటాలమ్మ ఆలయంలో హుండీల లెక్కింపు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి తెలిపారు. ఉదయం 9 గంటలకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కిస్తారన్నారు. ఈ లెక్కింపులో సేవాదళ్ సభ్యులు. ఆలయ సిబ్బంది పాల్గొంటారు.

వలంటీర్లకు సత్కారం



ఉంగుటూరు: వలంటీర్లు మరింత ఉత్సాహంగా పని చేయాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. వేంపాడు సచివాలయంలో 14 మంది వలంటీర్లుకు ప్రశంసా ప్రతాలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడంలో వలంటీర్లు కీలక పాత్ర వహిస్తున్నారని తెలిపారు. వలంటీర్లు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. అనంతరం వలంటీర్లకు సర్టిఫికెట్లు, బ్యాడ్జ్‌లను అందజేసి శాలువాలతో సన్మానించారు. వేంపాడు, చాగంటిపాడు సర్పంచ్‌లు శివనాగబాబు, లక్ష్మి అనూషా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు అవగాహన



గన్నవరం రూరల్: మండలంలోని మాదలవారిగూడెం గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఉద్యానవన రైతులకు అవగాహన కార్యక్రమం హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్ నిర్వహించారు. ప్రభుత్వం ఉద్యాన పంటల ప్రోత్సాహానికి సబ్సిడీలు అందజేస్తుందని వాటిని వినియోగించుకోవాలన్నారు. సూక్ష్మ సేద్యం ద్వారా డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తుందన్నారు. సచివాలయం కార్యదర్శి రాజశేఖర్, హెచ్‌ఏ దీక్షా రైతులు పాల్గొన్నారు.

చిన అవుటపల్లిలో ర్యాలీ



గన్నవరం రూరల్: నూతన జాతీయ విద్యా విధానం, జి–20 సదస్సు, పర్యావరణ దినోత్సవ లక్ష్యాలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వక్తలు చెప్పారు. జన్‌భగిదరి కార్యక్రమాన్ని చిన్న అవుటపల్లిలో బుధవారం నిర్వహించి విద్యార్థులచే ర్యాలీ చేశారు. మహిళా పోలీస్ వెంకటరమణ మాట్లాడుతూ పై అంశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచాలని పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ టీచర్‌లు సౌజన్య, నాగలక్ష్మీ, ఏఎన్‌ఎం కన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పి సుప్రియ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సహకారంతో విజయవాడ రైల్వే ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రైల్వే ఆస్పత్రి సీఎంఎస్ డాక్టర్ శౌరి బాల పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తదానంపై ప్రజల్లో ఎన్నో అపోహలు ఉన్నాయని, వాటిని విస్మరించి ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వలన ఆ వ్యక్తిలో కొత్త రక్తకణాలు ఉత్పత్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రక్తదాతల సాయంతో ఆపదలో ఉన్న వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. అనంతరం శిబిరంలో రక్తదానం చేసిన 32 మంది సిబ్బందిని ఆమె ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్‌లు డాక్టర్ ఎల్.రవికాంత్, డాక్టర్ ఎం.జైదీప్, డీఎంవో డాక్టర్ షాహిదా, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదానం

గన్నవరం: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం 9 గంటలకు నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బి. శ్రీనివాస్ బుధవారం తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో మొదటి మూడు స్థానాలు సాధించిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నగదు అవార్డులు, విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా, నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

యోగాశక్తితో సయాటికా నివారణ

పెనమలూరు: యోగాశక్తితో సయాటికాకు విముక్తి లభిస్తుందని డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. కానూరు అశోక్‌నగర్‌లోని ఇండియన్ ఓం కార్యాలయంలో యోగాశక్తి సాధన సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం యోగాశక్తితో సయాటికా పూర్తిగా నివారించవచ్చని అవగాహన సదస్సు నిర్వహించారు. సయాటికాకు మూత్రనాడి, గాల్‌బ్లాడర్ నాడిలో వచ్చు హెచ్చు తగ్గులే కారణమన్నారు. వ్యాధి ఉన్న వారు ప్రతి రోజు ప్రాణాయామం చేసి నాణ్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. అవగాహన సదస్సులో యోగా గురువులు కె.సుమతి, శ్రీరామమూర్తి పలువురు పాల్గొన్నారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి ప్రాంతం కాలువ కట్టకు చెందిన చిన్నం అలేఖ్య తొమ్మిది సంవత్సరాల క్రితం వ్యవసాయ పనులు చేసే భార్గవ్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. భర్త భార్గవ్‌తో పాటు బావ రమేష్, తోటికోడలు ధనలక్ష్మి అదనపుకట్నం కోసం అలేఖ్యను వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై కారు యజమాని దౌర్జన్యం చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి సెంటర్‌లో మంగళవారం ట్రాఫిక్ కానిస్టేబుల్ బొగ్గు వెంకట్రావు విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో పోరంకి సెంటర్‌లో మచిలీపట్నం నాన్‌స్టాప్ బస్సు, కారు ఢీ కొన్నాయి. కారు యజమాని బాషా రోడ్డు మధ్యలో కారు ఆపి, బస్సు డ్రైవర్‌తో గొడవపడసాగాడు. దీంతో బందరు రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయింది. రోడ్డు మధ్యలో ఉన్న కారు తీయాలని కానిస్టేబుల్ వెంకట్రావు కారు యజమాని బాషాను కోరాడు. బాషా ఆగ్రహంతో కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేశాడు. ఈ ఘటనపై కానిస్టేబుల్ వెంకట్రావు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

పరుపు కుడతానని బంగారు ఆభరణాలు చోరీ

పెనమలూరు: పోరంకిలో గుర్తు తెలియని వ్యక్తి పరుపులు కుడతానని నమ్మించి ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి కృష్ణవేణి నగర్‌లో సూరపనేని శాంతకుమారి నివసిస్తోంది. ఆమె ఇంటికి మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పరుపులు కుడతానని చెప్పాడు. తాగటానికి నీళ్లు కావాలని కోరడంతో శాంతకుమారి నీళ్లు తీసుకురావటానికి ఇంట్లోకి వెళ్లగానే ఇంట్లో టీవీ టేబుల్‌పై ఉంచిన బంగారు చెవిపోగులు తస్కరించి జారుకున్నాడు. చెవి పోగులు చోరీ జరిగాయని గమనించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వేధింపులు, హత్యాయత్నం కేసు నమోదు

కంకిపాడు: హత్యాయత్నం ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు...పట్టణానికి చెందిన సాలే శాంతి, చంటిబాబు భార్యాభర్తలు. వారిద్దరి మధ్య కొన్ని రోజులుగా మనస్పర్థలు కొనసాగుతున్నాయి. భార్యపై అనుమానంతో ఏర్పడిన వివాదంతో బుధవారం ఇంటి వద్దే కత్తితో భార్య శాంతి పొట్టలో పొడిచాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.